క్లుప్తంగా

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి

యలమంచిలి: మండలంలోని యలమంచిలి లంక, లక్ష్మీపాలెం గ్రామాలలో గురువారం పశు సంవర్ధక శాఖ అధికారులు పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పశు వైద్య సిబ్బంది 62 ఆవులు, 218 గేదెలకు గాలి కుంటు వ్యాధి (గాళ్ల వ్యాధి) రాకుండా టీకాలు 14 లేగ పెయ్య దూడలకు బ్రూసెల్ల వ్యాక్సిన్ వేశారు. అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం గ్రామాలలో శుక్రవారం ఈ శిబిరాలు నిర్వహిస్తామని మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. పాడి రైతులంతా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పెనుమర్రులో గ్రామదేవతల ఉత్సవాలు



పెనుమర్రులో పుట్టింటికి వస్తున్న గ్రామ దేవతల ఘటాలు

యలమంచిలి: జాతర ఉత్సవాల నిమిత్తం పెనుమర్రు గ్రామ దేవతలు చింతాలమ్మ, మారెమ్మ, చల్లాలమ్మ అమ్మవార్లను గురువారం పుట్టింటికి తీసుకువచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 29న జాతర నిర్వహిస్తారు. జాతర పూర్తయ్యాక 30న (ఉగాది రోజున) అమ్మవారి ఘటాలను ఆలయ ప్రవేశం చేయడంతో ఈ ఏడాది ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు పొత్తూరి సోమరాజు, కవురు గోపి, వెల్దూటి బుజ్జి, పాకా సూర్యనారాయణ, వానపల్లి శ్రీనివాస్ వివరించారు.

గోకార్ట్ చాంపియన్ స్వర్ణాంధ్ర



గోకార్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: నేటి యుగంలో గోకార్ట్ రేసింగ్ ఛాంపియన్‌షిప్ దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ విద్యార్థులకు ఒక మెట్టు అని, ఇంజినీరింగ్ విద్యార్థులు తమ సృజనాత్మకతను నైపుణ్యతను ప్రదర్శించాలని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ అన్నారు. ఇటీవల ఆదిత్య యూనివర్సిటీ సూరంపాలెం లో నిర్వహించిన గోకార్ట్ చాంపియన్ షిప్ పోటీల్లో బెస్ట్ కాస్ట్ అవార్డు సాధించడంతో పాటు రూ.10 వేల నగదు ప్రోత్సాహకాన్ని కైవసం చేసుకున్న స్వర్ణాంధ్ర కళాశాల మెకానికల్ విద్యార్థులను గురువారం కళాశాల ఆవరణలో అభినందించారు. మెకానికల్ బ్రాంచ్‌కి చెందిన స్పార్క్ రేసర్స్ టీం కెప్టెన్ వై.రాంబాబు, వైస్ కెప్టెన్ టీవీవీఎస్ స్వామిలను ఆయన అభినందించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని జిల్లాలో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతా బాయి గురువారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంగా కృషి చేయాలని, ఇందుకు అనుగుణంగా తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి మెడికల్ అధికారులు, సిబ్బందిని సమాలోచనలు చేయాలన్నారు.

శోభన్‌బాబు వర్ధంతి



భీమవరంలో శోభన్‌బాబు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: తెలుగు ఇండస్ట్రీలో ఎవర్ గ్రీన్ సోగ్గాడు శోభన్‌బాబు అని అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి కన్వీనర్ భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. శోభన్‌బాబు 17వ వర్ధంతి సందర్భంగా గురువారం భీమవరంలో శోభన్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భట్టిప్రోలు మాట్లాడుతూ కథ నాయకుడిగా శోభన్‌బాబు నటన ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయన్నారు. భీమవరంలో సేవా సమితి ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బొండా రాంబాబు, కారుమూరి భాస్కరరావు, అడ్డాల సత్యనారాయణ, కంచర్ల భాస్కరరావు గుప్తా, పెదపాటి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో గుండమ్మ చెరువు



ఆక్రమణలకు గురై కాలుష్యకోరల్లో చిక్కుకున్న గుండమ్మ చెరువు



పడమరవైపు గట్టు ఆక్రమణలకు గురికావడంతో ఇరుకైన రోడ్డు



చెరువు గట్టు వద్ద నిరుపయోగంగా ఉన్న కమ్యూనిటీ హాలు భవనం

కాలుష్యం వెదజల్లుతున్నా పట్టించుకోని అధికారులు

పెనుమంట్ర: అధికారుల ఉదాసీన వైఖరితో పాటు రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల కారణంగా మార్టేరు, వెలగలేరు గ్రామాల నడిబొడ్డున ఉన్న గుండమ్మ చెరువు ఆక్రమణలకు గురై కాలుష్య కోరల్లో చిక్కుకుంది. సుమారు రూ. 40 కోట్లకు పైగా విలువ చేసే పంచాయతీ ట్యాంకు పోరంబోకుగా ఉన్న ఈ స్థలంలో అనధికారికంగా కొందరు పేదలు, ధనికులు కూడా భవనాలు నిర్మించుకున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ చెరువుకు తూర్పువైపున శ్రీబాసంతీదేవి జెడ్పీ బాలికోన్నత పాఠశాల భవనాలు, శ్రీ బ్రహ్మేశ్వరస్వామి, శ్రీవేణుగోపాలస్వామి ప్రధాన ఆలయాలు ఉండగా పాఠశాల పక్కనే ఒక క్రైస్తవ ప్రార్థనా మందిరం ఉంది. పడమర వైపున గ్రామ దేవత పోలేరమ్మ ఆలయం ఉండగా ఆలయం దక్షిణం వైపు ఉన్న గట్టును మూడేళ్ల నుంచి గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డుగా వినియోగిస్తుంది. ఉత్తరం వైపు నుంచి తూర్పువైపు జెడ్పీ ఉన్నత పాఠశాల వరకు అనేక మంది ఆక్రమించి భవనాలను నిర్మించుకున్నారు. కొందరు ఆ ఆ భవనాలలో నివాసం ఉంటుండగా, కొందరు అద్దెలకు ఇవ్వడం గమనార్హం. ఆక్రమణల వల్ల 6.17 ఎకరాల విస్తీర్ణం ఉండాల్సిన ఈ చెరువు రెండు ఎకరాల విస్తీర్ణానికి కుచించుకుపోవడమే కాకుండా కాలుష్య కోరల్లో చిక్కుకుని దుర్గంధాన్ని వెదజల్లుతోంది.

ఆక్రమణల తొలగింపులో నిర్లక్ష్యం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఈచెరువును అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అప్పటి ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషితో చెరువు ఆక్రమణలో ఉన్న 35 మందికి పైగా పేదలకు జగనన్న కాలనీలలో ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లను నిర్మించారు. అయినప్పటికీ ఇక్కడ ఆక్రమణల తొలగింపు విషయంలో అధికారులు నిర్లక్ష్యం కారణంగా అక్కడ ఆక్రమణలు తొలగించలేకపోయారు. దీంతో చెరువు అభివృద్ధికి నోచుకోక దుర్గం దభరితంగా మారింది. ఎన్నో తరాల వారికి తాగు నీరు అందించిన ఈ చెరువు గట్టు ఆక్రమణలు తొలగించి వాకింగ్ ట్రాక్ నిర్మించి సుందరంగా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

చెరువు చుట్టూ ఆక్రమణలు తొలగించాలి



చెరువు చుట్టూ ఆక్రమణలు తొలగించి రహదారులు నిర్మించాలి. చెరువును శుభ్రపర్చి తాగునీటి చెరువుగా పునరుద్ధరించాలి. ఆక్రమణల విషయంలో అధికారుల ఉదాసీనత కారణంగా ఏళ్లుగా ఆక్రమణల సమస్యకు పరిష్కారం లభించడం లేదు.

– అల్లాడ భాస్కరరావు, గ్రామస్తుడు, మార్టేరు

ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం

చెరువు ఆక్రమణలు గుర్తించి గతంలో నివాసితులకునోటీసులు జారీ చేశాం. పలుమార్లు ఖాళీ చేయాలని ఆక్రమణదారులను హెచ్చరించాం. అయినప్పటికీ ఖాళీ చేయకపోవడంతో ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– కె.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి, మార్టేరు

నరసాపురంలో సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీ



పంటుపై గోదావరి దాటి నరసాపురం వచ్చిన సీఐఎస్ఎఫ్ సిబ్బంది

నరసాపురం: సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) ఏర్పడి 55 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దేశవ్యాపంగా సాగుతున్న సైకిల్‌యాత్ర బుధవారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి పశ్చిమగోదావరి జిల్లాలోకి ప్రవేశించింది. పట్టణంలోని గోదావరి పంటు రేవులో అమలాపురం, సఖినేటిపల్లి మీదుగా వచ్చిన ర్యాలీ పంటు దాటి నరసాపురం చేరుకున్నారు. పట్టణ సీఐ బి.యాదగిరి, ఎస్సై ముత్యాలరావు సిబ్బంది ర్యాలీకి స్వాగతం చెప్పారు. ఈ నెల 7న కలకత్తాలో బయలుదేరి ర్యాలీ వచ్చే నెల 3 నాటికి కన్యాకుమారి చేరుకోనుంది. సీఐఎస్ఎఫ్ ఏర్పడి 55 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కలకత్తా నుంచి కన్యాకుమారి వరకూ ర్యాలీ చేపట్టామని సీఐఎస్ఎఫ్ కమాండర్ నాయక్ చెప్పారు. నరసాపురం సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు అందే రంగారావు, మీసాల సత్యనారాయణ, షేక్ సిలార్ సాహెబ్, నెక్కంటి సుబ్బారావు తదితరులు ర్యాలీ సభ్యులకు స్వాగతం చెప్పి అభినందించారు. నరసాపురం నుంచి కృష్ణాజిల్లా మచిలీపట్టణానికి ర్యాలీ బయలుదేరి వెళ్లింది.

దగ్గులూరులో వ్యాధులపై సర్వే



ఇంటింటి సర్వే చేస్తున్న డాక్టర్ అడ్డాల ప్రతాప్

పాలకొల్లు సెంట్రల్: మండలంలో ప్రతి గ్రామంలో సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై సర్వే చేస్తున్నామని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని దగ్గులూరు గ్రామంలో సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై సర్వే చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు రోజుకు 50 ఐడీలు చేయాలన్నారు. ప్రతి రోజూ ఎన్ని ఇళ్లు సర్వే చేశారు? ఎన్ని ఐడీలు సర్వే అయ్యాయి? అనే వివరాలు రిజిస్టర్‌లో పొందుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజిబెత్ తదితరులు పాల్గొన్నారు.

రీ-సర్వే పనుల పరిశీలన



ఎన్నార్పీ అగ్రహారంలో రీసర్వే పనులు పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

ఉండి: రీసర్వే పనులు పారదర్శకంగా వేగంగా జరిగేలా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలో రీ-సర్వే పనులు జరుగుతున్న తీరును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాలకేంద్రం స్థలాలను దానిలో ప్రభుత్వ భవనాలకు కేటాయించిన స్థలాలను ఆయన పరిశీలించారు. అనంతరం రీ-సర్వేకు సంబంధించిన మ్యాప్‌లను ఆయన పరిశీలించి అధికారులకు, సిబ్బంది పలు సూచనలు, సలహాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ-సర్వే పనుల్లో ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా నిబంధనల మేరకు పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ స్థలాల గుర్తింపులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఉండాలన్నారు. కౌలతల ప్రకారం ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి జేవీటీ నాయడు, వీఆర్వో గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ పునఃప్రారంభం

ఆకివీడు: మండలంలోని కొల్లేరు తీర గ్రామం చినమిల్లిపాడులో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎట్టకేలకు గురువారం ఎస్సై హనుమంతు నాగరాజు, ఉపసర్పంచ్ గురుదాసు బాలాజీ పునఃప్రారంభించారు. గత వారం రోజులుగా మంచినీటి వాటర్ ప్లాంట్ ప్రారంభానికి రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత టీడీపీకి చెందిన నాయకులు ఆర్‌ఓ ప్లాంట్‌ను తామే నడుపుతామని తాళాలు తీసుకున్నారని, కొన్ని రోజులు నడిపిన తరువాత మూసివేశారు. ఎనిమిది నెలల తర్వాత గ్రామంలోని పెద్దలంతా కలిసి వాటర్ ప్లాంట్‌ను తామే నడుపుతామని చెప్పి ముందుకు రావడంతో గతంలో తాళాలు తీసుకున్న వ్యక్తులు అడ్డుపడ్డారు. తామే నడుపుతామని మళ్లీ ముందుకు వచ్చారు. ఈ వివాదాల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి ద్వారా ప్లాంట్‌ను నడిపించాలని నిర్ణయం తీసుకుని గ్రామస్తులు సమష్టిగా ఎస్సై నాగరాజు, ఉప సర్పంచ్(వైఎస్సార్ సీపీ) బాలాజీలతో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభించారు.

డీఎన్నార్‌లో 22న ఈటెక్ ఫెస్ట్

భీమవరం: భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాల బేసిక్ సైన్స్ – హ్యూమానిటీస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 22 తేదీన ఈ టెక్‌ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం అంజన్‌కుమార్ చెప్పారు. గురువారం కళాశాలలో ఫెస్ట్ పోస్టర్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కర్సాపాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) ఆవిష్కరించిన సందర్భంగా వివరాలను వెల్లడించారు. ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తున్న మొదటి సంవత్సరం విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించటానికి, సాంకేతిక నూతన నైపుణ్యాలను నేర్చుకోటానికి అద్భుతమైన వేదికన్నారు. ఈటెక్‌ఫెస్ట్‌లో ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పోస్టర్ ప్రెజెంటేషన్, జమ్ వంటివి నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిజి రత్నం, టెక్‌ఫెస్ట్ సమన్వయ కర్తలు పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ అరుణ కుమారి

పాలకొల్లు సెంట్రల్: నేల భూతాపం తగ్గాలన్నా భూసారం పెరగాలన్నా రైతులందరూ తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కన్వర్జెన్సీ జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి అన్నారు. గురువారం స్థానిక ఎంపిడివో కార్యాలయంలో పీఎండీఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) నవధాన్య సాగు కన్వర్జెన్సీ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ అరుణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో 30 రకాలు నవధాన్యాలు వేయడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. ఈ వ్యవసాయం వల్ల భూమిలో అనేక రకాలైన సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఏవో రాజశేఖర్, ఏపిఎం ఆచార్య, మండల సభ్యులు లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నోటి శుభ్రతపై అవగాహన



నోటి శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మౌని

పాలకొల్లు సెంట్రల్: చిన్ననాటి నుంచి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనభరచాలని తద్వారా అనేక రుగ్మతలకు దూరంగా ఉండవచ్చని డాక్టర్ కావలి మౌని అన్నారు. గురువారం స్థానిక బ్రాడీపేట సింగోడియన్ ప్రాథమిక పాఠశాలలో యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో వరల్డ్ ఓరల్ హెల్త్ డే క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో డాక్టర్ మౌని మాట్లాడుతూ నోటిని ప్రతి రోజూ శుభ్రం చేసుకోవాలన్నారు. ఏది తిన్నా నోటిని పుక్కిలించు ఉయ్యాలన్నారు. ప్రతిరోజూ ఉదయం, రాత్రి బ్రష్ చేసుకోవాలని ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ యామన విజయలక్ష్మి, సెక్రటరీ దేవరపు కాంచనమాల, ట్రెజరర్ శిద్దిరెడ్డి శైలజారాణి, హెచ్ఎం వెంపర్ల సత్య సౌజన్య ప్రజ్ఞ పాల్గొన్నారు.

అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలి



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): ఫిర్యాదుదారుల నుంచి అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వర పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత తహసీల్దార్లను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి భీమవరం ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల తహసీల్దార్లు, వీఆర్వోలతో సమావేశమూ మండలాల వారీగా పి జి ఆర్ ఎస్, రెవెన్యూ సదస్సులు, రీ సర్వే గ్రామసభలో వచ్చిన ఫిర్యాదులు, పెండింగ్ అడంగల్ సవరణలు, 22 ఏపై వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల అర్జీల పరిష్కార సమయంలో సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరించాలన్నారు. ముందుగా అర్జీదారులకు నోటీసు ఇచ్చి వారికి సమస్యపై అవగాహన కల్పించాలని, వారి నుంచి ఏమైనా ధ్రువపత్రాలు అవసరమైతే ఒక వారం రోజులు సమయం ఇచ్చి ఆయా ధ్రువపత్రాలు పొందిన తర్వాత సమస్యను పరిష్కరించాలని ఆయన సూచించారు. నోటీసు ఇవ్వకుండా, క్షేత్రస్థాయిలో పర్యటించకుండా అర్జీని తిరస్కరించరాదన్నారు. సమావేశంలో భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఏవో పీఎస్ వీ ఎస్ ఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

రైతన్నకు కన్నీటి కష్టాలు

- శివారు పంటపొలాలకు సాగునీటి ఎద్దడి
- ఎండిపోతున్న పంట చేలు



గుమ్ములూరులో నీటి ఎద్దడికి నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు (ఫైల్)



ఆచంటలో ఎండుతున్న వరిచేలు



కొడమంచిలిలో ఇంజన్లతో నీటిని తోడుకుంటున్న రైతన్నలు

పెనుగొండ: రైతన్నలకు సాగు నీటి కష్టాలు తప్పడం లేదు. ఇటీవల కాలంలో ఎండ తాకిడి పెరిగిపోతుండడంతో వరి చేలు వేగంగా తడారిపోతున్నాయి. అసలే వంతుల వారీ విధానం, శివారు ప్రాంతాలకు సాగు నీరు అందకపోవడంతో రైతన్నల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. పంట కాలువల ప్రారంభంలో నీటి ఎద్దడి లేకుండా నీరు అందుతున్నా, శివారు ప్రాంతాలకు మాత్రం నీరు చేరడం కష్టసాధ్యంగా మారింది. ముఖ్యంగా ఆచంట మండలం, పోడూరు మండలం, పెనుగొండ మండలంలోని శివారు ప్రాంతాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ఆచంట మండలంలో ఆచంట, ఆచంట వేమవరం, వల్లూరు, కొడమంచిలి, కోడేరుల్లో కొన్ని ప్రాంతాలకు నీరు అందడం లేదు. పోడూరు మండలంలో గుమ్ములూరు శివారు ప్రాంతాల్లో నీటి కష్టాలు తప్పడం లేదు. గుమ్ములూరులో ఇటీవల వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో తడారిన వరి చేలల్లో మట్టి గడ్డలతో రైతులు నిరశన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి ఆచంట వేమవరంలోనూ నెలకొంది. ఆచంట వేమవరంలో గత సీజన్‌లో వరదలు, తుఫాన్ల బాధలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరి నాట్లు సైతం ఆలశ్యమయ్యాయి. దీంతో వారికి చివరిలో నీరు అందే పరిస్థితి ఉండకపోవచ్చునని ఆందోళనకు గురవుతున్నారు.

ఇంజిన్ల ద్వారా తోడుతున్నా..

తాడేరు డ్రయిన్ శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదని ఆప్రాంత రైతన్నలు స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దృష్టికి తీసుకు వెళ్లడంతో తాడేరుకు అడ్డుకట్ట వేసి, ఇంజిన్ల ద్వారా నీటిని అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇంజన్లతో నీటిని అందిస్తున్నా ఎండ తాకిడికి వరి చేను తడిచే పరిస్థితి కనుచూపు దూరంలో కనిపించడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెనుగొండ మండలంలో తామరాడ, కొఠాలపరు, వడలిలో శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. వేసవి ప్రారంభంలోనే నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతుంటే రానున్న రోజుల్లో సాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండే అవకాశం ఉందని వాపోతున్నారు. అధికారులు స్పందించి సాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు.

మంచినీటి సరఫరాకు యాక్షన్ ప్లాన్

సాక్షి స్పందన

నరసాపురం: 'మంచినీటి సమస్య తీరేదెన్నడు?' శీర్షికన సాక్షి దినపత్రికలో ఈ నెల 3న ప్రచురించిన కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణంలో అన్ని వార్డుల్లో వేసవిలో మంచినీటి సరఫరాకు యాక్షన్ ప్లాన్ వెంటనే తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య గురువారం ఆదేశించారు. అలాగే శివారు వార్డుల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరాకు రూ.2.65 లక్షలతో అంచనాలు తయారు చేశారు. పైప్‌లైన్స్ లీకేజీల మరమ్మతులకు, చెరువును పూర్తిస్థాయిలో నింపడానికి రూ 4.90 లక్షలతో అంచనాలు రూపొందించినట్టు మున్సిపల్ కమిషర్ ఎం.అంజయ్య చెప్పారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

పారిశుద్ధ్య పనుల్లో ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని శానిటరీ సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. గురువారం కమిషనర్ పలు వార్డుల్లో పర్యటించి చెత్తసేకరణను పరిశీలించారు. చెత్త సేకరించే సమయంలో దగ్గర ఉండి సిబ్బందికి సూచనలు చేశారు. చెత్త సేకరణలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని చెప్పారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

పాలకొల్లు సెంట్రల్: పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను సాధ్యమైనంత వరకూ పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీ కార్యదర్శిల అధ్యక్షులు పాలా శ్రీనివాస్ అన్నారు. గురువారం విజయవాడలో కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లను కలిసి పంచాయితీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు దొంగ సత్యనారాయణ, ట్రెజరర్ సుంకర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

23న శ్రీరామ జపయజ్ఞం

పెనుగొండ: దేశ ధర్మాల రక్షణ కోసం, ఆలయాల పరిరక్షణ కోసం హైందవి ఆధ్వర్యంలో ఈ నెల 23న ఆదివారం పెనుగొండ జనార్ధన స్వామి కల్యాణ మండపంలో శ్రీరామ జప యజ్ఞము పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వహణ సమితి కన్వీనర్ చింతాకుల గోపాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో భువనేశ్వరి పీఠం పీఠాధిపతులు కమలానంద భారతి స్వామీజీ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అనంతలక్ష్మి ప్రవచనాలు చెబుతారన్నారు. ఉదయం 9 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ, హనుమాన్ చాలీసా పారాయణ ఏర్పాటు చేశామన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన హిందువులంతా భారీ స్థాయిలో పాల్గొనాలని కోరారు.

పేకాడుతున్న 8 మంది అరెస్ట్

యలమంచిలి: మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో పేకాడుతున్నారనే సమాచారం పై గురువారం దాడి చేసి 8 మందిని పట్టుకున్నట్లు ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3860 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రయ్య వివరించారు.

9.45 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఆకివీడు: మండలంలోని అప్పారావు పేట గ్రామంలోని రేషన్ షాపు నెం. 0534007లో ఆకస్మిక తనిఖీలు చేయగా 9.45 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించినట్లు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ మహేష్ గురువారం చెప్పారు. గ్రామంలోని షాపు తనిఖీకి వెళ్లగా తాళాలు వేసి ఉన్నాయని, గతంలో కూడా ఇదే విధంగా తాళాలు వేసి ఉండడంతో వెనుదిరిగామన్నారు. ఈ సారి తాళాలను గ్రామ వీఆర్వో బందా హరిశ్చంద్ర ప్రసాద్, ఇతర డీలర్లు, గ్రామ పెద్దల సమక్షంలో తాళం బద్దలకొట్టి పరిశీలించగా బియ్యం లభించినట్లు చెప్పారు. డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశామన్నారు.

బిల్లుల్లో మోసం జరిగిందంటూ ఫిర్యాదు

భీమవరం: భీమవరం రిలయన్స్ జియోమార్ట్ గ్రాబ్ టీం లీడరుగా పనిచేస్తున్న చిట్టూరి బాలకృష్ణ బిల్లు లేకుండా ప్యాకింగ్ చేసిన వస్తువులు డెలివరీ చేస్తూ మోసగించినట్లు సంబంధిత గ్రాబ్ ఏరియా మేనేజరు కుడిపూడి సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత ఏడాది నవంబర్ 23 నుంచి దఫదఫాలుగా వస్తువులు ప్యాకింగ్ చేసుకుని బిల్లు లేకుండా బయటకు తరలించినట్లు సీసీ కెమెరా పుటేజిలో నమోదైందన్నారు. దీనిపై సదరు బాలకృష్ణను నిలదీయగా బిల్లులు లేకుండా రూ.88,299 విలువైన వస్తువులు తీసుకెళ్లినట్లు అంగీకరించాడని తెలిపారు. ఇదిలా ఉండగా స్టోర్‌లోని విలువైన సరుకు కనిపించకపోవడంపై స్టోర్ ఆడిట్ విభాగం పరిశీలించగా రూ.28 లక్షల వ్యత్యాసం ఉందన్నారు. సొమ్మును స్టోర్‌లో జమ చేయకుండా సొంతంగా వాడుకున్న బాలకృష్ణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొనగా ఎస్సై బి.వై. కిరణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.